## అమరావతి కథలు

# అవతలొడ్డు పొంగింది

చవితి వెన్నెల!

రాత్రి ఏడున్నర, ఎనిమిది గంటల వేళ ఆడవాళ్ళు వీధరుగుల మీద కబుర్లు చెప్పు కుంటుంటే, కొందరు ఇళ్ళలో రాత్రి వేపడాల్లో మునిగివుంటే పూజారి వీధి పిల్లలంతా కృష్ణవొడ్డున చట్టుమీద కబుర్లాడు కుంటూ, వాదులాడుకుంటూ తిరుగు తున్నారు.

ఆ సమయాన అవతలొడ్డు ఇసక పర్ర మీంచి దూరంగా పెద్దకేక 'ఎవరా మడిసీ! పడవ దాటి పోయింది రచ్చించండో!' అంటూ. మొదట్లో పిల్లలు పట్టించుకోలేదు గాని, ఆ తర్వాత జాగ్రత్తగా వింటే ఆ కేకలు మరీ ఎక్కువయినాయి.

పిల్లలు సరదాకొద్దీ వినీవినీ "ఓహోయ్ నీకేం భయంలేదు మేవున్నా మొహోయ్" అని అరిచారు చట్టుమీంచి.

దాంతో అవతలొడ్డు మనిషి "బాబోయ్! చచ్చి మీ కడుపున పుడతాను బాబోయ్! పిల్లలు గలోణ్ణి బాబోయ్! సచ్చిపోతాను బాబోయ్" అని ఏడుపులూ.

"ఏడవబాకురా ఎదవా! నీకేం భయం లేదురా కుంకా!" పిల్లలు సరదాకొద్దీ తిట్లు.

"చచ్చి మీ కడుపున పుడతాను బాబో! మీరే దిక్కు తండ్రో" ఇసక పర్రమీంచి శోకాలు.

అందులో ఓ కుర్రాడు కోసురాయి మీద కెక్కి పెద్దగా "నీకేం కావాల్రా!" అని అంటాడు.

"పడవ తీసుకురాండి బాబోయ్! చచ్చి పోతాను బాబోయ్" అని అవతలొడ్డునుంచి ఏడుపు.

పిల్లలంతా కూడబలుక్కున్నారు. పడవ సరంగు, రేవులో పడవొదిలేసి వెళ్ళిపో యాడు. లంగరె తేసి మనమే పడవ తీసి కెళ్ళి వాణ్ణి రక్షిద్దాం అని నిశ్చయించారు.

వాడి ఏడుపులు చూసి నవ్వుకున్న పిల్లలు పడవ తీసికెళ్ళటానికి నిశ్చయించు కున్నారు గాని పడవ నడపటం ఎవరికీ రాదే! అందరూ పది పన్నెండేళ్ళవాళ్ళే! మరి పెద్దవాళ్ళకెవరికన్నా చెప్దామా! అను కున్నారు. చెప్తే మజా లేదు. మనవే పడవ తీసికెళ్ళి ఆ చవటని రక్షిద్దాం అనుకుని అందరూ ఇళ్ళదగ్గరకొచ్చి గడవెయ్యటం చాతయిన పాలేరు రంగడికి రహస్యంగా ఈ విషయం చెప్పి మెల్లిగా కృష్ణవొడ్డుకు చేరుకున్నారు. ఈ వార్త పెద్దలకు తెలియ కుండా జాగ్రత్తపడ్డారుగాని పిల్లలకి తెలి యక పోతుందా! వీధి వీధి పిల్లలంతా, కాస్త కునుకులో ఉన్నవాళ్ళతో సహా అంతా కృష్ణ వొడ్డుకు చేరారు.

"రచ్చించండి దేవుడో..." అవత లొడ్డు నుంచి కేక-

"భయంలేదు వస్తున్నావో" అని యాభై మంది పిల్లల కేక ఇవతలొడ్డు నుంచి.

లంగరె తేసి పిల్లలంతా పడవలో చేరారు. గడవేసేది ఒక్క పాలేరు రంగడే. పిల్లలు ఓ పక్క కూర్చోరే! అటూ ఇటూ తిరగడాలు. కేరింతలు - పడవొరిగి పోతోంది - వాళ్ళలో వాళ్ళ కీచులాటలు రంగడు అదమాయించి వాళ్ళ నోరు మూయించి కదలకుండా కూర్చోపెట్టాడు. పడవ కృష్ణ మధ్య కొచ్చింది. అక్కడ గొప్ప వడి.... పిల్లల్లో పెద్దవాడు కిట్టి "నేనూ గడేస్తాను" అన్నాడు. వొద్దు దేవుడా అన్నా వినకపోతే "నువ్వు తెడ్డు వెయ్యి దొరా" అని బతిమాలి కూర్చోపెట్టాడు రంగడు. పడవ మెల్లిగా అవతలొడ్డుకు చేరుకుంటుంది. పిల్లలంతా పెద్దగా పాటలు. పద్యాలు లంకించుకున్నారు. చప్పట్లతో తాళాలతో కృష్ణంతా మోగిపోతోంది. ఆ సమయాన కిట్టిగాడు తెడ్డు వొదిలేసి రంగడి దగ్గరకొచ్చి "ఒరే ఒరే నేనొక్కసారి గడే స్తానురా...." అని బతిమిలాడాడు.

అవతలొడ్డు కొచ్చాం గదా అని గడ చేతికిచ్చాడు రంగడు.

కిట్టి గడలో నాలుగో వంతు లేడు. ఎక్కడలేని ఉత్సాహంతో గడ అందుకుని సయ్యిని నీళ్ళలో వేశాడు. పడవ ముందుకు సాగటంతో గడ చెయ్యి జారింది. కిట్టి నీళ్ళలో పడబోతుంటే రంగడు టక్కున పట్టుకున్నాడు. గడ క్రిష్ణలో కొట్టుకు పొయింది. పడవ వొడ్డు చేరింది.

పిల్లలంతా "హో" అంటూ ఇసకలో కొచ్చారు.

"మిరు రాకపోతే ఈ రాత్రేళ ఈ ఇస కలో గుండెపగిలి సచ్చేవాణ్ణి బాబోయ్!" అని కళ్ళనీళ్ళతో పరుగుపరుగున పడవలో కొచ్చాడు ఇసకపర్ర మనిషి.

రంగడికి గొప్ప దిగులైంది. గడ కృష్ణలో కొట్టుకుపోయింది. పడవ నడవదని చెప్పాడు. పిల్లల గుండెలు గుభిల్లుమన్నాయి. బిక్కమొహాలు వేశారు. అప్పటిదాకా ఉన్న ఉత్సాహం దుఃఖంగా మారిపోయింది. ఒక డెవడో బావురుమన్నాడు. దాంతో యాభై మందిపిలలు బావురుమన్నారు.

"అమ్మా! రచ్చించండే..."

"అయ్యా! నాకు బయమేస్తుందే!"

"పిన్నీ నా కాకలేస్తుందే ...."

"అవ్వా! నాకు దెయ్యాల బయమే."

"వో......" అని అవతలొడ్డునుంచి యాభై మంది పిల్లల ఏడుపులు. వాళ్ళతో కలిసి "చచ్చి మీ కడుపున పుడతానో...." అని పరదేశి ఏడుపు.

వీధిలో పిల్లలెవరూ లేకపోవటం, కృష్ణ అవతలొడ్డునుంచి గుండెలు చీల్చుకు పోయేట్లు పిల్లల ఏడుపులు వినిపించటంతో తల్లులు, తండ్రులు బెంబేలయిపోయి కృష్ణ ఇవతలొడ్డుకు చేరారు. అవతల్నించి పిల్లలు ఆపకుండా ఏడుపులు. ఇవతలొడ్డునుంచి తల్లులు "మా తండ్రే.... మా చిట్టే.... మా బుల్లే... మా కన్నే.... నేను చచ్చిపోనో" అంతకంటె పెద్దగా ఏడుపులు!

ఎవరికీ ఏంచేయటానికి తోచిందిగాదు. పడవేమో అవతలుంది. పున్నయ్య, సదయ్య ఆడవాళ్ళకి ధైర్యం చెప్పి పుట్ట గోచీలు బిగించి రెండు తెప్పకొయ్యలు వేసుకుని "సయ్ సయ్" మని ఈదుకొంటూ అవతలొడ్డుకు చేరుకున్నారు. వాళ్ళని కావి లించుకుని పిల్లలు మళ్ళీ ఏడుపులు. ఆకలేస్తోందో అని గోల, పడవలో ఎక్కించుకొని వీళ్ళని తీసుకెళ్దామంటే గడలేదు. సదయ్య ధైర్యం కోసం అక్కడేవుండి పున్నయ్యని వెనక్కి పంపించాడు.

పున్నయ్య వెనక్కొచ్చి మరో పడవకోసం వాకబు చేస్తే ఎక్కడా పడవలేదు. ధరణి కోట రేవు పడవకు తారెయ్యటానికి వొడ్డెక్కించారు. గడకోసం మనిషిని అడితీకి పంపించారు. ఈలోపున అవతలొడ్డునుంచి పిల్లలు 'ఆకలేస్తుందో' అని అరుపులు.

ఇంతలో పల్లెపీడినుంచి మరో నాలుగు తెప్పగొయ్యలు తెప్పించి మరో నలుగురు మనుషులు అన్నం మూటలు, పెరుగు మూటలు కట్టుకుని రెండు లాంతర్లతో అవ లొడ్డుకు చేరారు. పిలలకి ఆ అన్నాలు పెట్టి కృష్ణనీళు తాగించటంతో కొంతశాంతించారు.

ఎట్టకేలకు అడితీనుంచి గడ వొచ్చింది. ఆ గడని రయ్యిని తెప్పకొయ్య మిద అవ తలొడ్డుకి తిసికెళ్ళి పడవకి లంగరె తేసి, "మాతండ్రుల్లారా! మా తల్లుల్లారా! ఎక్కండర్రా పడవ" అని పెద్దగా పెద్దలు అరిస్తే పిల్లలు ఒక్కళ్లా వచ్చి పడవెక్కారే!

వాళ్ళు చవితి వెన్నెట్లో చద్ది భోంచేసి, ఇసక తిన్నెలో గీతలు గీసుకుని చర్ పట్టీ కుందులు ఆడుకుంటూ, పడవ గురించి, గడ గురించీ. అమ్మా అయ్యా గురించీ ఎప్పుడో మర్చిపోయారు, పిల్లల ఆట పాటల్తో మోగిపోతున్న అవతలొడ్డుకి అంత రాత్రి వేళ ఎవరో కితకితలు పెట్టి నట్టుంది. ★

సత్యం శంకరమంచి